# శ్రీధర కథలు

అంజి ఎప్పుడు పుట్టాడో, ఎవరికి పుట్టాడో వాడికే తెలియదు. గాలికి పెరిగి చెట్టంత అయ్యాక ఇప్పుడేం చేస్తున్నాడో ఎవరికీ తెలియనివ్వడు.

పబ్లిక్‌గార్డెన్ నెంబర్ వన్ గేట్ వాడి కేరాఫ్ అడ్రసు.

రాత్రి ఏడు గంటలయింది. రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని అటూ ఇటూ చూస్తూ గార్డెన్ గోడ చివరిదాకా వచ్చాడు. సందులో క్రీనీడలో నీడగా మారి తచ్చాడుతున్నాడు. ఎవరెవరో వచ్చారు. వాడి చేతిలో డబ్బు పెట్టారు. అంజి బ్రౌన్‌షుగర్ పాకెట్ వాళ్ల చేతిలో పెట్టాడు. మాటా లేదు, మంతీ లేదు. ఆ పక్కనే ఉన్న యూరినల్స్‌కి వచ్చిన వాళ్లు తమ పని ఎంత మామూలుగా చేసుకుపోతున్నారో, వీడి దగ్గరి కొచ్చే వాళ్లు అంత రొటీన్‌గా తమ పని చేసుకు పోతున్నారు.

## విస్కీ చుక్కలు గంధం చెక్కలు

ఎనిమిది గంటలకి సరుకుమొత్తం అమ్ముడైపోయింది వాడు ఇంకిప్పుడు దొర. హుషా రుగా ఈల వేసుకుంటూ వెళ్తున్న వాడ్ని ట్రాఫిక్ కానిస్టేబుల్ పిల్చాడు. అంజి వెళ్లి వినయం నటిస్తూ శాల్యూట్ కొట్టాడు.

''ఏంట్రా, వెళ్లిపోతున్నావ్?'' అని అడిగాడు.

అంజి యాభై నోటు ఒకటి ఆయన చేతిలో పెట్టాడు.

''ఏంట్రా ఇది? దానమా, ధర్మమా?'' అని గర్జించాడు.

అంజి ఇంకో రెండు యాభైలు చేతిలో పెట్టాక, 'సరే పో' అన్నాడు.

అంజి హుషారుగా ఈల వేసుకుంటూ నెంబర్ వన్ గేటు దగ్గరకొచ్చాడు. అక్కడ సుబ్బులు ఎదురు చూస్తోంది.

''ఏంటీ, ఏమైనా తగిలిందా?'' అని అడిగాడు అంజి.

రోజూ మాడిపోయిన బల్బులా ఉండే సుబ్బులు మొహం ఇవాళ వెయ్యికాండిల్ బల్బులా వెలిగిపోతోంది.

కొంచెం చాటుకెళ్లారు. అది జాకెట్‌లో నుంచి చిన్నపర్స్ తీసి ఇచ్చింది. అంజి హుషారుగా కళ్లు ఎగరేశాడు.

''రెండొందలున్నాయి...'' అన్నది సుబ్బులు.

ఇద్దరూ నాంపల్లి వైపు నడిచారు. రెండు విస్కీ క్వార్టర్ బాటిల్స్ కొనుకున్నారు. రెండు ప్లేట్లు మిర్చి బజ్జీలు, ఒక ప్లేటు చికెన్ బిర్యానీ తీసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దాటి అవతలి ఫ్లాట్‌ఫాం చివరకు వెళ్లారు. చీకటిగా చాటుగా వున్న చోట చతికిలబడ్డారు. బాటిల్స్ ఓపెన్ చేసి తాగుతూ, మిర్చి తింటున్నారు.

సుబ్బులు తన ఘనకార్యం గురించి చెప్పుకొచ్చింది. ''కండక్టరొచ్చి టిక్కట్టు తీసుకోమంటుండు. అందరూ పైసలు దీస్తరు గద. అప్పుడే నే అందరి వంకా జూసిన. నా పక్కన నిలబడ్డటోడు టిక్కెట్టు తీస్తున్నప్పుడు పర్సు చూసిన మంచిగనే ఉన్నాయి. వాడి పక్కనేజేరిన... కాలు తాకిస్తుండు. భుజం తాకిస్తుండు. నేను గూడ సప్పుడు చేయకుండా, నవ్వుకుంట నిలబడిన. వాడు మీద బడుతుండు. మంచిగ జేబులో నుంచి పర్సులాగిన... ఇసంట జరిగిన... ఇస్టాపు రాంగానే దిగిన... వాడు గూడ దిగిండు. లొల్లి పెడతాడేమోనని ఏరే బస్సులో ఎక్కిన.''

సుబ్బులు పర్స్ కొట్టేసిన రోజున హిమాలయాలు ఎక్కినంత సంబర పడిపోతుంది. సంతోషంతో తేలిపోతుంటుంది. ఇక విస్కీబాటిల్ ఖాళీ చేసేటప్పటికీ, నిజంగానే మనసు గాల్లో ఊగుతుంటది. ఒళ్లు తూలుతుంటది.

అంజిగాడి మీదకు ఒరిగిపోయింది. విస్కీ వాసన విస్కీ వాసనను ముద్దెట్టుకుంది. కడుపు నిండిన పేదరికం పేదరికాన్ని కావలించుకుంది. రివ్వున వీచిన గాలి వాళ్ల చల్లారిన ఆవేశాన్ని చిచ్చు కొట్టింది. ఆదమరిచి నిద్రపోయారు.

ప్రకృతిలో మమేకం కావటం వాళ్లకు బాగా తెల్సు. ఎండాకాలం చెట్ల నీడలే ఏ.సి. రూంలు. వానాకాలం చిరుజల్లులే బాత్‌రూం షవర్లు. చలి కాలం వెయిటింగ్ రూం కార్నర్లే నులివెచ్చని నెల

వులు, పగలంతా – పార్క్‌లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు – వాళ్లకు నందనవనాలు.

ఏ రోజు పర్స్ తగిలితే ఆ రోజు పండగ. దోచుకోవటమే గాని దాచుకోవడం తెలియదు. ఎంత దొరికితే అంత ఆ రోజే ఖర్చు చేసే అసలైన స్వామ్యవాదులు – వాళ్లు.

తెల్లారింది. వెయిటింగ్ రూంలో స్నానాలు చేశారు. స్టేషన్ బయటకొచ్చేటప్పటికి యాద్గిరి కనిపించాడు. ముగ్గురూ ఇరానీ హోటల్లో బన్ రొట్టెలు తిని, టీ తాగి బస్‌స్టాప్ కొచ్చారు.

తొమ్మిది గంటల నుంచీ బస్సుల్లో రద్దీ పెరుగుతుంది. ఫుట్‌బోర్డు పైమెట్టు దగ్గర ఒకడు, కింద మెట్టు మీద ఒకడు సెటిల్ అయిపోతారు. అంజి, యాద్గరి ఎక్కేవాళ్లనీ, దిగే వాళ్లనీ చేతులతో తడుముతారు. గిరాకీ తగిలితే వాడ్ని కదలకుండా అటూ ఇటూ చేరి నొక్కేసి, దిగనివ్వకుండా ఎక్కనివ్వకుండా ఆపి, పర్సులాగేసి తర్వాత స్టాప్‌లో దిగిపోతారు.

మధ్యాహ్నం ఒంటి గంటకు ఒక చోట అంజి, యాద్గిరి, సుబ్బులు కలుసుకుంటారు. డబ్బులుంటే బీర్ తాగి బిర్యానీ తింటారు. లేకపోతే పల్లీలు తిని, నీళ్లు తాగుతారు. నాలుగింటికి మళ్లీ డ్యూటీ ఎక్కుతారు.

సెలవురోజుల్లో బస్సుల్లో గిట్టుబాటు కానప్పుడు అంజి నల్లమందు బ్రౌన్‌షుగర్ అమ్ముతాడు. సుబ్బులు, యాద్గిరి సినిమా హాలు దగ్గర బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతారు. వాళ్లకు పెద్ద కోరికలేమీ లేవు. తినటం, తాగటం – ఈ కుక్షంభరత్వమే జీవితం.

ఆ రోజు కూడా అంజి, సుబ్బులు చీకటి మాటున 'డిన్నర్' చేస్తున్నారు.

''యాద్గిరి పత్తా లేడు?'' అన్నది సుబ్బులు.


''వాళ్ల అయ్యను ఎతుకుతుంటడు..''

''గదేంది?'' అని అడిగింది సుబ్బులు.

''యాడనన్న యాక్సిడెంటు అయి ఎవడన్నా సచ్చిండనుకో.... కారు కిందనో, లారీ కిందనో పడి... ఆ సచ్చి నాయన మా నాయన.. అంటూ ఏడుస్తడు. పైసలు అడుక్కుని తెచ్చుకుంటడు. ఒక పాలి ఏమయిందంటే యాక్సిడెంటు అయింది. జనం సుట్టు మూగిన్రు... ఈడు మా అయ్య సచ్చిండు... అని ఏడ్చుకుంటు జనాన్ని తోసుకుని పోయిండు. ఇగ తీరా జూస్తే సచ్చింది కుక్క... గంటే ఏమన్నమాట... ఈడు కుక్కకు పుట్టిండన్నట్టు...'' అని అంజి చెప్పగానే సుబ్బులు తాగుతూనే ఇరగబడి నవ్వింది.

ఆ నవ్వు దగ్గులోకి దించింది. దగ్గు ఏడుపులోకి దించింది.

''ఏందే... యామాయె నీకు?'' అని అంజి అడిగాడు.



''కడుపులో నొప్పిలేస్తుంది..'' అన్నది సుబ్బులు.

అంజి కంగారు పడ్డాడు. సుబ్బులు ధైర్యం చెప్పింది ''ఏంగాదు... కొంచెమాగితే తక్కువైతది....'' అని అన్నదే గాని తెల్లవార్లు మూలుగుతూనే ఉంది.

మర్నాడు సుబ్బులు వద్దంటున్నా, అంజి దాన్ని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు పోయాడు. డాక్టరమ్మ అన్ని పరీక్షలు చేసింది.

''నీకు నెలసరిలో రక్తం బాగా ఎల్తదా?''

''ఎల్తది... డాక్టరమ్మా...''

''ఇంతకు ముందు బిడ్డలున్నారా?''

''ఒక బిడ్డ పుట్టిపాయె...''

''నీకేమన్న అలవాట్లున్నయా?''

''తాగుత...''

''దినాం తాగుతావా?''

''పైసలుంటే తాగుతా..''

''మానెయ్యాల... లేకుంటె శాన కష్టమయితది...'' అన్నది డాక్టరమ్మ.

''ఇగ గిప్పుడేం చేయాలంటారు?'' అని అడిగాడు అంజి.

''ఆమెకు ఆపరేషన్ చేసి గర్భసంచి తీసెయ్యాల... లేకుంటే చాలా బీమారు అయితది..'' అన్నది డాక్టరమ్మ.

''ఆపరేషన్‌కి ఎంతయితదమ్మ...''

''పాతిక వేలు అయితది...'' అన్నదామె.

''ఎప్పుడు రామంటారు?''

''మీ ఇష్టం... తొందరగజేయించకుంటే శాన పరేషాన్ అయితది...'' అన్నది డాక్టరమ్మ.

అంజి సుబ్బులు ఆస్పత్రి నుంచి బయటకొచ్చారు. అంజి ఆలోచనలో పడ్డాడు. ఎన్ని జేబులు కొడితే, ఎన్ని బ్రౌన్‌షుగర్లు అమ్మితే పాతిక వేలు పోగయితయ... ఒక పక్క దిగులుగా ఉన్నా, వాడు ఎంతకష్టపడి అయినా సరే డబ్బు పోగు చేయటానికే నిర్ణయించుకున్నాడు.

డాక్టరమ్మ చెప్పిన విషయం అంజి యాద్గిరితో చెప్పాడు. డబ్బు పోగు చేయటానికి వాడూ సాయం చేస్తానన్నాడు.

రెండు రోజులు అసలేం దొరకలేదు. మూడో రోజు ఒక ఖద్దరు లాల్చీ ఆయన ''ఈ బస్సు నిజాం ఆస్పత్రికి ఎల్తదా?'' అని అడిగాడు.

ఫుట్‌బోర్డు మీద వేలాడుతున్న యాద్గిరి వెళ్తదని చెప్పాడు. ఆయన ఎక్కేందుకు చెయ్యి అందించాడు. ఖద్దరు లాల్చీ ఒక మెట్టు ఎక్కాక ఆయన పడకుండా ఉండేందుకు తన రెండో చేతిని ఆయన నడుం చుట్టూ వేశాడు. జేబులో పర్స్ యాద్గిరి చేతికి తగిలింది. వాడు పై మెట్టు మీద ఉన్న అంజిని చూసి నవ్వాడు. కళ్లతో సైగ చేశాడు. అంజి ఆయన పైకి ఎక్కకుండా పై మెట్టుమీద అడ్డుగా నిల్చున్నాడు. అంజి జేబులో నుంచి చిన్న కత్తెర తీశాడు. ఆయన జేబు కత్తిరించాడు. పర్స్ లాగి యాద్గిరికి ఇచ్చాడు.

ఎంతనేర్పుగా లాగినా ఆయన కనిపెట్టి 'పర్స్ పర్స్' అరిచాడు. అందరూ బస్ ఆపమని గోలగా అరిచారు. బస్ స్పీడ్ కొంచెం తగ్గగానే యాద్గిరి దిగిపోయాడు. అంజిని మాత్రం బస్సులోని వాళ్లు పట్టుకున్నారు.

''వీడే జేబు కత్తిరించాడు'' అని ఖద్దరు చొక్కా అనగానే అందరూ తలా ఒక దెబ్బ వేశారు. ఒకరిద్దరు డొక్కలో పొడిచారు.

''పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తే సరి... మక్కెలిరగతంతారు...'' అన్నారు ఇంకెవరో.

అంజిని బస్సు దింపగానే, పట్టుకున్న వాళ్లచేయి కొరికేసి ఎవరికీ అందకుండా పరుగెత్తాడు.

పర్సులో రెండు వేలు ఉన్నాయి. ఇంకేం... రాత్రికి ముగ్గురూ తాగుతూ కూర్చున్నారు.

సుబ్బులు కన్నీళ్లతో అన్నది... ''నా కోసం తన్నులు తిన్నావా? ఏడనన్నా గట్టి దెబ్బ తగిలితే... పోలీసోళ్ల చేతినబడితే...''

''ఇది కొత్తేంది మనకు? ఏ పనిచేసిన ఇగ అంతో కొంత డేంజర్ ఉంటనే ఉంటది...'' అన్నాడు అంజి సీసా ఎత్తి నాలుక తడుపుకుంటూ.

''కానీ ఇప్పుడు నాకోసం జేస్తనుగద.... ఏదన్న అయితే నాకు ఎట్లనో ఉంటది..'' అన్నది సుబ్బులు.

''నాకు అమ్మ, అయ్య, అక్క చెల్లి, అన్నా తమ్ముడు – ఎవరూ లేరు. దేవుడు నాకు నిన్ను ఒక్కదాన్ని ఇచ్చిండు. నిన్నుకూడా బతికించుకోలేక పోతే – ఏంటికి బతకాల్నే?'' అన్నాడు అంజి ఏడుపు ఆపుకుంటూ,

అందర్నీ చూస్తున్నాడు. భార్యాపిల్లలు, బంధువులూ, అయినవాళ్లు – అంతా చీటికి మాటికీ కల్సి కష్టసుఖాలు చెప్పుకుంటుంటారు. ఒకళ్ల నొకళ్లు ఆదుకుంటుంటారు – అలాంటి జీవితం లేనందుకు వాడి మనసులో ఎన్నాళ్లగానో గూడు కట్టుకున్న దిగులు ఇప్పుడు బయటకు తన్నుకొస్తోంది.

యాద్గిరి అన్నాడు ''నాకు అప్పవి నువ్వు. దేవుడిచ్చిన అప్పవి. నీ కోసం తన్నులు తిన్నా, తల కోసేసి ఇచ్చినా తక్కువే అయితది..''

అంజి సుబ్బులు చేతిలోని సీసా లాక్కున్నాడు. ''డాక్టరమ్మ నిన్ను తాగుడు బంద్ చెయ్యమన్నదిలే...''

''డాక్టర్లు అట్లనే జెబుతారు. తాగకుండా, తినకుండా ఏంటికి బతకాలి? మస్తు తాగుతా... మస్తు తింట... ఎప్పుడు టయమొస్తే అప్పుడు జస్త... నే చచ్చినంక... నన్ను తగలేసేటప్పుడు రెండు విస్కీ చుక్కలు చల్లండి... అదే నా చివరి కోరిక...'' అన్నది సుబ్బులు.

''అప్పుడు రెండు చుక్కలు గాదు బాటిల్ మొత్తం పోస్త... గాని గిప్పుడింక జాల్లే...'' అన్నాడు అంజి.

''నిజంగ పోస్తవా?'' అన్నది సుబ్బులు తాగిన మైకంలో తల ఊపుతూ.

''నిజంగనే...'' అన్నాడు అంజి.

సుబ్బులు మెల్లగా నిద్రలోకి జారుకుంది.

అంజి, యాద్గిరి ప్లాట్ ఫాం అంచున కూర్చుని ఆలోచనలో పడ్డారు.

''డాక్టరమ్మ జల్ది ఆపరేషన్ చేయిస్తే మంచిదన్నది. కానీ పాతికవేలు ఎప్పుడు దొరకతయి... ఎప్పుడు దీనికి ఆపరేషన్ జేయించాల..'' అన్నాడు అంజి దిగులుగా.

యాద్గిరి కూడా మౌనంగా ఉండి పోయాడు.

నిజానికి సుబ్బులుకి ఇంతకుముందు పెళ్లి అయింది. మొగుడితో కాపురం చేసే రోజుల్లో రోజూ దాని మొగుడు తాగొచ్చి దీన్ని చావగొడుతుండేవాడు. కొన్నాళ్లకు మొగుడికి ఎదురు తిరగటం మొదలెట్టింది. వాడితో పాటు కల్లు దుకాణానికి వెళ్లి తాగటం అల వాటు చేసుకుంది. తాగుడుకు బానిసై పోయింది.

బిడ్డను కన్నది. ఆ బిడ్డ పురుట్లోనే చనిపోయాడు. ఆ విషయంలోనే ఇద్దరూ పెద్దగా గొడవ పడ్డారు. మొగుడు సుబ్బుల్ని కిరసనాయిలు పోసి చంపబోయాడు.

సుబ్బులు మొగుడ్ని వదిలేసి వచ్చింది. అంజితో ఉంటోంది. వీళ్లకి పెళ్లి కాలేదు. మొగుడు పెళ్లాల



మధ్య ఉండే అనుబంధం ఉన్నా, వాడు మొగుడన్న అధికారం చెలాయించడు. సుబ్బులు పెళ్లాన్నన్న అణుకువ ప్రదర్శించదు. ఇద్దరూ సంపాదిస్తున్నారు – వాళ్లకు చేతనైన పద్ధతిలో నిజమైన సహజీవనం చేస్తున్నారు – ఆ మాట అనకపోయినా, దానికి అర్థం తెలియకపోయినా.

డబ్బు సంపాదించటం ఎలా – అన్న ప్రశ్న అంజిని వేధిస్తోంది. ఈ చిల్లర పనుల వల్ల రోజు గడుస్తుందే గానీ, వచ్చిన ఆపద గట్టెక్కేటట్లు లేదు.

రైల్వే ఫ్లాట్‌ఫాం మీదకు వచ్చే, పోయే ఖరీదైన మనుషులను, వాళ్ల తెచ్చే బరువైన సూట్ కేసులను చూస్తూనే ఉన్నాడు అంజి. ఒకటి రెండు సూట్ కేసులు నొక్కేస్తే, ఈ ఆపద గట్టెక్కియ్య వచ్చన్న అభిప్రాయం కలిగింది. యాద్గిరి 'సై' అన్నాడు.

పగలంతా ఇద్దరూ అక్కడే కాపుకాశారు. కానీ సరైన ఛాన్స్ దొరక లేదు. సాయంత్రం వచ్చిన రైల్లో ఒక పెళ్లి వారి బృందం దిగింది. వాళ్ల సామాను దించటానికి పోర్టర్లు ఎగబడ్డారు. చేతుల్లోని సూట్ కేసులు లాక్కుని కిందకు చేరేస్తున్నారు. ఒక పక్క దిగే వాళ్ల హడావుడి. ఒక పక్క పోర్టర్ల హడావుడి. మరో పక్క దార్లో అడ్డంగా ఉన్న సూట్‌కేసులు.

పోర్టర్లలో ఒకడు సూట్‌కేసులు తలుపు దగ్గరకు చేరేస్తుంటే, మరొకడు కిందకు దించుతున్నాడు. మిగతా ప్రయాణీకులు హడావుడి చేస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని అంజి ఒక సూట్‌కేసును పక్కకు లాక్కున్నాడు. లావెటరీల మధ్య నుంచి అవతల కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గరకెళ్లాడు. దాన్ని యాద్గిరికి ఇచ్చాడు. వాడు దాన్ని ఇంకో కంపార్ట్‌మెంటు అవతలికి తీసుకెళ్లి అక్కడ నుంచి కిందికు దిగి దర్జాగా స్టేషన్ బయటకెళ్లి ఆటో ఎక్కాడు.

పెళ్లి వారి బృందం అంతా ఫ్లాట్‌ఫాం మీద నిలబడి ఉన్నారు. ఇద్దరు యువకులు సామాన్లనీ ట్రాలీ మీదకు ఎక్కించి, లెక్క పెడుతున్నారు. ఒకటి తక్కువ... లెక్క తప్పిం దని మళ్లీ లెక్క... మళ్లీ లెక్క... ఎన్నిసార్లు లెక్క పెట్టినా ఒక సూట్ కేసు తక్కువ వస్తోంది.

పెళ్లికూతురు తల్లి వచ్చి చూసుకుంది. ఎర్ర సూట్‌కేసు. వి.ఐ.పి.ది పోయింది.. ''అయ్యో... నగలు, డబ్బూ అంతా అందులోనే ఉందర్రా... సరిగ్గా చూడండి... కొంపలంటుకు పోతయి...'' అంటోందామె.

ఇద్దరు ముగ్గురు మళ్లీ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి చూశారు. అంతా వెతికారు. ఆ యువకులిద్దరూ పోర్టర్ల మీద యుద్ధానికి దిగారు.

''మీరే దాన్ని దొంగిలించారు...'' అన్నారు వాళ్లు.

పోర్టర్లు పోట్లాటకు దిగారు.

పెళ్లికూతురు తల్లి ఏడుస్తోంది. ''కట్నం డబ్బులు... నగలు అన్నీ అందులోనే ఉన్నాయి. పోయిందంటే మాత్రం పెళ్లి వారు నమ్ముతారా? ఈ పెళ్లి జరిగేటట్లు లేదు...''

''నే నంటూనే ఉన్నాను.... రాహుకాలంలో బయల్దేరొద్దూ అని... నా మాట ఎవరైనా వింటేనే...'' అన్నదింకొక ఆమె.

పెళ్లి కూతురు కాబోలు కన్నీళ్లు తుడుచుకుంటోంది. మగవాళ్లు విసుక్కుంటున్నారు – ఏడుపులు ఆపండని.

సుబ్బులు అక్కడే నిలబడి అన్నీ వింటూనే ఉంది. ప్రత్యక్షంగా చూస్తూనే ఉంది.

పావుగంటలో సుబ్బులు పబ్లిక్ గార్డెన్ గేటు దగ్గర కొచ్చేటప్పటికి అంజి, యాద్గిరి బస్ స్టాప్‌లో బెంచిమీద కూర్చుని ఉన్నారు. వాళ్లిద్దరి మొహాలు వెలిగిపోతున్నాయి – మధ్యలో ఉన్న సూట్‌కేస్‌ను చూసుకొని.

ముగ్గూరు గార్డెన్‌లోకి వెళ్లి చెట్టుకింద కూర్చున్నారు.

''ఎంతుంటదో ఇండ్ల..'' అన్నాడు యాద్గిరి సూట్‌కేసు చూస్తూ.

''నేను ఎన్నాళ్లు బతుకుతానో దెల్వదు. అసలు కుక్కల్లా నక్కల్లా ఈ బతుకు బతికినా ఒకటే, సచ్చి నాకటే.... కానీ ఓ ఆడపిల్ల బతుకు బుగ్గిపాలు చేసి, తెచ్చిన డబ్బుతో నా జబ్బు నయం చేసుకోను – మనసొప్పత లేదు...'' అన్నది సుబ్బులు.
అంజి, యాద్దరి మాట్లాడలేదు. సీసాలెత్తి విస్కీ గుక్కెడు నోట్లో పోసుకుని చప్పరిస్తూ ఉండి పోయారు.

''మంచిగనే ఉండొచ్చు...'' అన్నాడు అంజి.

''తెరిసి సూద్దాం...'' అన్నాడు యాద్గిరి.

''ఇప్పుడొద్దు... ఇక్కడొద్దు...'' అన్నది సుబ్బులు... ''కట్నం డబ్బులు, పెళ్లికూతురి నగలు ఇండ్లనే ఉన్న యంట... వాళ్లు అనుకుంటుంటే ఇన్న..''

అంజి, యాద్గరి సంతోషానికి అంతులేదు. సంతోషం వచ్చినా దుఃఖం వచ్చినా, విస్కీ సీసాలు ఖాళీ కావల్సిందే.... అందుకని అంజి, యాద్గిరి ఆ పని మీద బయటికెళ్లారు.

వాళ్లటు వెళ్లగానే సుబ్బులు సూట్‌కేసుతో స్టేషన్ కెళ్లింది. అప్పటికే రైల్వేపోలీసు స్టేషన్‌లో పెళ్లి వారు కంప్లయింట్ ఇచ్చారు.

మిగతా వాళ్లు ఆటోలో వెళ్లి పొయ్యారు. కానీ ఒకరిద్దరు మాత్రం పోర్టర్లతో పోట్లాడు తూనే ఉన్నారు.

సుబ్బులు లోపలికెళ్లి సూట్‌కేసు వాళ్లకిచ్చింది.

''ఇదెవలో ఆడ పోర్టికో కాడ వదిలేసి ఎల్లింద్రు... పోలీసులకిద్దామని తెచ్చిన...'' అన్నది సుబ్బులు.

అందరూ సుబ్బులు వంక ఆశ్చర్యంగా చూశారు. పెళ్లి వారి బృందంలోని యువకులు ఆ సూట్ కేసును గుర్తు పట్టారు.

సుబ్బుల్ని మెచ్చుకుని ఆమెకు అయిదొందలు బహుమానం ఇవ్వబొయ్యారు.

''మీ సొమ్ము మీకిచ్చిన... నాకేంటికి బహుమానం..'' అంటూ బయటికెళ్లి పోయింది సుబ్బులు.

రాత్రికి మళ్లీ ముగ్గురూ మొహాలు వేలాడేసుకుని కూర్చున్నారు. కాసేపటికి సుబ్బులే అన్నది.

''నేను ఎన్నాళ్లు బతుకుతానో దెల్వదు. అసలు కుక్కల్లా నక్కల్లా ఈ బతుకు బతికినా ఒకటే, సచ్చి నాకటే.... కానీ ఓ ఆడపిల్ల బతుకు బుగ్గిపాలు చేసి, తెచ్చిన డబ్బుతో నా జబ్బు నయం చేసుకోను – మనసొప్పత లేదు...'' అన్నది సుబ్బులు.

అంజి, యాద్దరి మాట్లాడలేదు. సీసాలెత్తి విస్కీ గుక్కెడు నోట్లో పోసుకుని చప్పరిస్తూ ఉండి పోయారు.

వారం రోజులు గడిచాయి.

సుబ్బులకు జబ్బు ఎక్కువైంది. తెల్లవార్లూ గోడ చాటుకెళ్లి వస్తూనే ఉంది. ఒళ్లు కాలి పోతూనే ఉంది. విస్కీ తాగుతూనే ఉంది... తూలిపోతోంది... తేలి పోతోంది ఒళ్లు...

తెల్లారాక అంజి సుబ్బుల్ని ఆస్పత్రికి తీసుకెళ్తుంటే, దార్లోనే దాని దారి అది చూసుకుంది.

అదే ఆటోలో అంజి దాన్ని గార్డెన్‌లోకి తీసుకొచ్చి చెట్టుకింద పడుకోబెట్టాడు. గేటు దగ్గర వాళ్లందరికీ ఈ వార్త తెల్సింది. వాళ్లంతా చూడటానికొచ్చారు.

యాద్గిరి అందరి దగ్గరా చందాలు వసూలు చేశాడు. పెళ్లి కొత్త చీర, పూలదండ తెచ్చాడు.

గార్డెన్ సూపరెంటు ఫోన్‌చేసి మున్సిపాల్టీ లారీ తెప్పించాడు.

సుబ్బుల్ని చివరిసారి చూడటానికి వానదేవుడొచ్చాడు. స్నానం చేయించాడు. సుబ్బులు ప్రకృతిలో పుట్టి పెరిగి, గిట్టిన మనిషి మరి.

అంజి కొత్త చీర కప్పాడు.

''నారాయణ, నారాయణ...'' అంటూ సుబ్బుల్ని పట్టిలేపారు.

అందరూ శ్మశానం దాకా వచ్చారు. అంజి తల కొరివి పెట్టాడు. మంటలు పైకి లేచాక, విస్కీ సీసా మూత తీసి గుమ్మరించాడు.

యాద్గిరి మాత్రం, రెండు మంచి గంధం చెక్కలు భద్రంగా కాలుతున్న శవం మీదపెట్టాడు.

''అది మా యప్పలాంటిది... దొంగతనాలు చేస్తది... ఇష్కీ తాగుతది... దాని మనసు మాత్రం ... మంచి గంధం చెక్కలాంటిది... ఆ గంధం చెక్క సువాసనతో ఓ పెళ్లి పందిరి గుబాయించింది...'' అన్నాడు పొంగుతున్న కన్నీటిని తుడుచుకుంటూ.

విస్కీ చుక్కలతో పాటు, గంధం చెక్కలూ ఆహుతి అయినవి... మెలికలు తిరుగుతున్న మృత్యుకాల రేఖా ధూమంలోనూ గంధం సువాసన మిళితమై పోయింది.

*